క్లుప్తంగా

విఘ్నేశ్వరునికి మాజీ మంత్రి రోజా పూజలు



విఘ్నేశ్వరునికి పూజలు చేస్తున్న మాజీమంత్రి

నగరి: వినాయక చవితిని మాజీ మంత్రి ఆర్కేరోజా తన నివాసంలో కుటుంబ సమేతంగా వైభవంగా నిర్వహించారు. నివాసంలోని వినాయకునికి, మట్టి వినాయక ప్రతిమను అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ప్రజలకు ఎలాంటి విఘ్నాలు కలుగకుండా చూడాలని మొక్కినట్టు ఆమె తెలిపారు.

నరసింహపురంలో తాగునీటి సమస్య

పాలసముద్రం: మండలంలోని నరసింహపురంలో వారం రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి తాగునీరు కోసం ఏర్పాటుచేసిన పైపులైన్ దెబ్బతినడంతో అందులో మట్టి పేరుకుపోయిందని, దీంతో నీరు రావడం లేదని చెబుతున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌ను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వన్నెరెడ్డి సంక్షేమ సమితి నూతన కార్యవర్గం



ఎంపికైన నూతన కార్యవర్గం

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా వన్నెరెడ్డి బీసీ యువజన సంక్షేమ సేవ సమితి నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈశలాపురం వద్ద ఉన్న సంఘ కార్యాలయంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా పి.చిరంజీవి, గౌరవాధ్యక్షుడిగా కె.మురగారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.సంతోష్, ఎస్.సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా ఎం.మదన్, సహాయ కార్యదర్శులుగా వి.రామరాజు, ఇ.మూర్తి, కోశాధికారిగా పి.నాగరాజుతో పాటు 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో జూదరులు

వెదురుకుప్పం: మండలంలోని మిట్టూరు ప్రాంతంలో గురువారం పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు తెలిపారు. 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,740 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రేణిగుంట: మండలంలోని వెంకటాపురం చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉండడం గమనించిన స్థానికులు గురువారం రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న రేణిగుంట అర్బన్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, పసుపు రంగు షర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు అర్బన్ పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుష్ప కావళ్లతో మొక్కులు చెల్లింపు

కాణిపాకం: చవితిని పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి భక్తులు పుష్పకావళ్లతో మొక్కులు చెల్లించారు. తొలుత ఆలయ కోనేరులో కావళ్లకు అభిషేకం అనంతరం పెరుమాళ్ల స్వామి ఆలయంలో కావళ్లను అలంకరించారు. అనంతరం వందలాది మంది భక్తులు డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి సన్నిధిలో కావళ్లతో మొక్కులు చెల్లించారు. కాగా కాణిపాకం గ్రామస్తులు వారం రోజుల పాటు దీక్షలు చేసి కావళ్లతో ఏటా మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ.

క్యాన్సర్ వ్యాధిని గుర్తిద్దాం

చిత్తూరు రూరల్(కాణిపాకం): ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ కోరారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఎన్‌సీడీ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు.



పాలసముద్రం: గణపయ్యకు పూజలు చేస్తున్న భక్తులు



పాలసముద్రం: వెంగళరాజుకుప్పంలో..







వెదురుకుప్పం: ఏర్పాటు చేసిన భారీ విగ్రహం, కార్వేటినగరం: పాదిరికుప్పంలో పూజారికి బహుమానం, నగరి: కొండచుట్టు మండపం వద్ద..

- వైభవంగా వినాయక చవితి వేడుకలు
- భారీ ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు
- ఆకట్టుకున్న వినాయక ప్రతిమలు

గణనాథా సదా స్మరామి..!



నగరిలో జనంతో కిక్కిరిసిన ప్రధాన రహదారి

నగరి: నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు మట్టితో చేసిన వినాయకుని ప్రతిమలను కొనుగోలు చేసి పూజలు చేశారు. ప్రధాన రహదారి మొత్తం పూజాసామగ్రి విక్రయాల, కొనుగోలుదారులతో కిక్కిరిసింది. చావడి ప్రాంతం, బస్టాండు ప్రాంగణం, ఓంశక్తి ఆలయం సమీపం, బైపాస్ రోడ్డు వద్ద, పద్మావతి నగర్, కొత్తపేట, సత్రవాడ, ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, బస్టాండు ప్రాంగణంలోను భారీ వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. విగ్రహాలు ఏర్పాటుచేసిన ప్రాంతంలో భక్తులకు గుగ్గిళ్లు, చక్కెర పొంగలి, పులిహోర, మిరియాల పొంగలి, స్వీట్లు ప్రసాదంగా పంచారు, భక్తులకు అన్నదానం చేశారు.

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని పలు కాలనీలు, వీధుల్లో చలువ పందిళ్లు వేసి, భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. వినాయక చవితి ప్రాశస్త్యాన్ని వేదపండితులు వివరించారు. స్థానిక బజారువీధిలోని వినాయకస్వామి ఆలయంలో సాయంత్రం ఉత్సవమూర్తిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, మూషిక వాహనంపై కొలువుదీర్చి, మేళతాళాలు, బాణసంచా మోత నడుమ ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే జెండామాను వీధిలోని సెల్వ గణపతి, బెస్తవీధి తరుణ గణపతి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజార్చనలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. మండల కేంద్రంలోని వినాయక ఆలయంలో ఉదయం అభిషేకం, అర్చనలు చేశారు.. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. అలాగే ఆరూరు, అగరం, అత్తూరులోనూ పండుగ వేడుకలు నిర్వహించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: స్థానిక గాండ్లమిట్ట కూడలిలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శివాలయం వీధి, చిన్ననగర్ వీధి, తూర్పు వీధి. బంగారమ్మ వీధి, కార్వేటినగరం పెద్ద దళితవాడ, పాదిరికుప్పం, కొల్లాగుంట, డీఎం పురం, కేఎం పురం, ఎర్రమరాజుపల్లె, గాజంకి, టీకేఎం పేట, సీడీ కండ్రిగ, కత్తెరపల్లెలో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. భక్తులకు దాతలు అన్నదానం చేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలవ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు కుడుములు, ఉండ్రాళ్లు, సజ్జలు, చెరకు, అరటి పండ్లు, ఎలక్కాయలు, మొక్కజొన్న, పూజాసామగ్రి, పంబ వాయిద్యాలతో ఊరేగించి స్వామివారికి సమర్పించారు. పిల్లలు తమ పాఠ్యపుస్తకాలను స్వామివారి పాదాల వద్ద వుంచి పూజలు చేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండల కేంద్రంతోపాటు పచ్చికాపల్లం, పాతగుంట, తిరుమలయ్యపల్లె, దేవళంపేట, జక్కిదొన, ఆళ్లమడుగు, బొమ్మన్‌దొడ్ల ప్రాంతాల్లో భారీ వినాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేశారు. సీఆర్‌కండ్రిగలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. పచ్చికాపల్లంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు హరికృష్ణ, పేట ధనుంజయరెడ్డి, బీమశంకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వెదురుకుప్పం తూర్పు దళితవాడలో జరిగిన వినాయక వేడుకల్లో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, మాజీ మండల యువత అధ్యక్షుడు బోడిరెడ్డి నరేష్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.







నింద్ర: ఊరేగుతున్న వినాయక స్వామి, పుత్తూరు: జెండామాను వీధిలో ఊరేగుతున్న వినాయకస్వామి, వెదురుకుప్పం: పచ్చికాపల్లం వేడుకలో వైఎస్సార్‌సీపీ నేతలు

చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో

పాలసముద్రం: గ్రామాల్లో చెత్తను సేకరించి సంపద తయారు కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసి అదనపు ఆదాయం పొందాలని డీఎల్‌డీవో ఇంద్రాణి ఆదేశించారు. ఆమె గురువారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలోని చెత్త సంపద కేంద్రాన్ని, మతవలం గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడ వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్, ఈవోఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శంకర్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వర్షంలోనే ఉట్లోత్సవం!



ఉట్టి కొడుతున్న యువకులు

నగరి: వినాయకచవితి పురస్కరించుకుని గురువారం కొండచుట్టు మండపం వద్ద యువకులు ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. జోరువర్షం వచ్చినా యువకులు లెక్కచేయకుండా ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. విజేతగా నిలిచిన వారికి నగరి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ప్రభాకర్ రాజు బహుమతులు అందజేశారు. మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి నీరు అందించడమే లక్ష్యం



గుంటిపల్లెలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజలకు సురక్షిత నీరు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేసిందని మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి తెలిపారు. ఆయన గురువారం ఎంపీపీ మహాసముద్రం హేమలతారెడ్డితో కలిసి గుంటిపల్లెలో ఎంపీపీ నిధులతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నంత వరకు ఎక్కడా తాగునీటి సమస్య లేదన్నారు. గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత నీరు అందించామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో తాగు, సాగునీటి కష్టాలు నెలకొన్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి నేడు ప్రజల కష్టాలని విస్మరిస్తోందని దుయ్యబట్టారు. పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలన్నా, మెరుగైన విద్య, వైద్యం అందాలన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 14 నెలలకే రాష్ట్ర ప్రజలకు కష్టాలు తప్పలేదని, రానున్న ఎన్నికల్లో కూటమి ఎన్ని హామీలిచ్చినా ఓటమి తప్పదన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ మహా సముద్రం సురేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌రెడ్డి, గోవిందరెడ్డి, చక్రవర్తినాయుడు, నవీన్‌కుమార్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, దూదిశంకర్, దేవరాజులురెడ్డి, ఎంపీటీసీ శివలింగం, భూపతినాయుడు, చెన్నకేశవులు నాయుడు, అనీల్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డిని కలిసిన మాజీ ఉప ముఖ్యమంత్రి



మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డిని గురువారం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి పెనుమూరు పులిగుండు వద్ద కలిశారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న కుట్ర రాజకీయాలకు ఎప్పటికీ భయపడేది లేదని తెలిపారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, అందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం జ్ఞానేంద్రరెడ్డిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహనగిరిధర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, దేవరాజులురెడ్డి పాల్గొన్నారు.

వడమాలపేట జెడ్పీ హైస్కూల్‌కు అవార్డు

వడమాలపేట (పుత్తూరు): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఏటా ప్రకటించే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును వడమాలపేట జెడ్పీ బాలుర హైస్కూల్ వరుసగా మూడవసారి కైవసం చేసుకుని హ్యాట్రిక్ కొట్టింది. హెచ్‌ఎం కరుణా నవనీతం గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఏటా జిల్లా నుంచి ఐదు పాఠశాలలను స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేస్తారని తెలిపారు. 2022–23లో తమ స్కూలు క్రీడాకారులు 97 పాయింట్లతో ఐదవ స్థానం సాధించగా 2023–24లో 178 పాయింట్లతో మూడవ స్థానం, 2024–25లో 222 పాయింట్లతో మరోసారి మూడవ స్థానాన్ని సాధించడంతో పాటు హ్యాట్రిక్ కొట్టడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ అవార్డు సాధించిన క్రీడాకారులను, పీడీ చంద్రశేఖర్‌రాజును ఆమె అభినందించారు. శుక్రవారం ఈ అవార్డును అందుకోనున్నట్లు చెప్పారు.

పాలిటెక్నిక్ కాలేజీకి కంప్యూటర్లు

- ఇండియా మెటల్ కంపెనీ వితరణ



మాట్లాడుతున్న తైజో ఇవామీ

పుత్తూరు: స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి గురువారం శ్రీసిటీకి చెందిన ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంటీపీ) ఎండీ తైజో ఇవామీ 15 కంప్యూటర్లను వితరణగా అందజేశారు. తైజో ఇవామీ మాట్లాడుతూ, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా సమాజానికి తమ కంపెనీ తనవంతు సేవలందిస్తోందన్నారు. ఈ దిశగా విద్యా రంగానికి చేయూతనివ్వడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సాంకేతిక, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని తద్వారా తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీకుమార్, కంపెనీ ప్రతినిధులు ఎల్.హరిహరన్, కె.రాజీవ్, డి.సుప్రియ, సురేంద్రనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: స్థానిక కేబీఆర్ కల్యాణ మండపంలో గురువారం రాత్రి జరిగిన తడుకు ఎంపీటీసీ సుబ్బరత్నమ్మ, గంగాధరం దంపతుల కుమారుని వివాహ రిసెప్షన్‌కు మాజీ మంత్రి ఆర్కే రోజా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మరో కల్యాణ మండపంలో కచ్చురవేడు వైఎస్సార్‌సీపీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి కుటుంబ వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. అంతకు ముందు తిరుచానూరు పీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో సదాశివకోన మాజీ చైర్మన్ మునిబాబు కుమార్తె పావని, తట్నేరి యువ నాయకుడు గణేష్ వివాహ రిసెప్షన్‌కు హాజరై వారిని ఆశీర్వదించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనయ్య, తంగవేలు కుటుంబ సభ్యుల పెళ్లి గురువారం వేర్వేరు చోట్ల జరిగింది. ఇందులో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేంద్రరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, పెనుమూరు మాజీ కన్వీనర్ సురేష్‌రెడ్డి, ఎంపీపీ సరిత జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో శివగంగై



అగ్గి కుండలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు



గంగమ్మ దేవత

నగరి: పట్టణంలోని కొత్తపేటలో బుధవారం గంగజాతర వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య గంగమ్మ ఊరిమధ్యలో వేసిన వేపాకు గుడిసెకు వచ్చి చేరింది. మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిదుస్తులతో అంగప్రదక్షిణం చేశారు. పసుపు దుస్తులు ధరించి, అగ్గికుండలు చేతపట్టి, అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. జాతర ప్రాంతంలో కొలువుదీరిన భవాని, ఎల్లమ్మ, శివగంగై దేవతల విశేష అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. అలాగే, సాంస్కృతిక కార్యక్రమాలు, వినూత్న ప్రదర్శనలు భక్తులను అలరించాయి. గంగమ్మ దర్శనార్థం ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. తోపులాటలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కుంభం సమర్పించారు. రాత్రి గంగమ్మను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.